
# జనసేన నుండి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లోకి చేరికలు

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 30:**




చిలకలూరిపేట : గణపవరం గ్రామం లో జనసేన కు చెందిన 20 కుటుంబాలు మంగళవారం మాజీ మంత్రి విడదల రజిని సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లో చేరారు. గణపవరం గ్రామానికి చెందిన పసుపులేటి సాయి, కామిరెడ్డి గోపీనాథ్, ఆవుల ఫణీంద్ర, నరేంద్ర, షేక్ రషీద్, శివ, ఆవుల దేవ, శ్రీనివాసరావు, కరిముల్లా, షేక్ హబీబుల్లా, ముజీబ్, షేక్ జాన్ సైదా , షేక్ అమీర్ తో పాటు మరికొందరు జనసేనను వీడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని సాదరంగా వారిని పార్టీ లోకి ఆహ్వానించి కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వలేటి వెంకటేశ్వర రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, పిల్లి సాగర్ బాబు, నాలుగోవార్డు ఇన్చార్జి కాటా వెంకటేశ్వర్లు, మాజీ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పూడి రామారావు ,ఆముదాలపల్లి అంజి మరియు పలువురు వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# ప్రజా సేవే ధ్యేయంగా సేవే మార్గంగా ప్రజల కోసం సేవ చేస్తున్నాడు కొండిశెట్టి సురేష్ బాబు





**పెన్ పవర్, గుంటూరు, జులై 30**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ. కృష్ణా జిల్లాశాఖ చైర్మన్ పదవికి సుదీర్ఘకాలిక, సామాజిక సేవాకారుడు డాక్టర్ కొండిశెట్టి సురేష్ బాబు ప్యానెల్ తరఫున పోటీ చేస్తున్నారు. జీవితకాల సభ్యుడిగా రెడ్‌క్రాస్ లో చేరినప్పటి నుండి ప్రజల కోసం, సేవ కోసం కృషి చేస్తున్నారు. గత కొంతకాలంగా సొసైటీలో జరుగుతున్న అవకతవాలపై న్యాయం కోసం పోరాడుతూ, ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సత్యనారాయణ గార్లకు ఫిర్యాదు చేశారు. విచారణ అధికారిణిని నియమించి చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. కొంతమంది స్వార్థపరులు ఎన్నికలు జరపకుండా పదవులు పంచుకోవాలని కుట్రలు పన్నుతుండగా, ఆ కుట్రలకు ఎదురుగా ప్రజాస్వరంగా నిలుస్తున్న సురేష్ బాబు కి అందరూ మద్దతు ఇవ్వాలని కోరుతున్నాము. సభ్యులందరూ గమనించి, న్యాయబద్ధమైన పాలనకు, పారదర్శకతకు, ప్రజా సేవకు అండగా ఉండాలని హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తూ. ప్యానెల్ తరఫున పోటీ చేస్తున్న

డాక్టర్ కొండిశెట్టి సురేష్ బాబు కి మద్దతివ్వండి!

సేవ పక్షాన్ని నిలబడండి. అవకతవాలకు పారదోలండి!

# ఆగస్ట్ ఒకటి నుంచి ఆస్తులకు ఆటో మ్యుటేషన్ విధానం అమలు కమిషనర్ పులి శ్రీనివాసులు




**పెన్ పవర్, గుంటూరు, జులై.30.**

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 1 నుండి ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలు చేయనున్నదని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తులకు ఆటో మ్యూటేషన్ ని ఆగస్ట్ 1 నుండి రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ విధానాన్ని ఇప్పటికే విజయవాడలో అమలుచేయగా అక్కడ సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలోనూ ఆగస్ట్ ఒకటి నుంచి ఆస్తులకు ఆటో మ్యుటేషన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆస్తులకు ఆటోమ్యుటేషన్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి కావటంతో పాటుగా సమయం కూడా ఆదా అవుతుందన్నారు. ఇప్పటి వరకూ ఆస్తుల మ్యుటేషన్ (ఆస్తుల బదలాయింపు) కోసం, ఆస్తులు కొనుగోలు చేసిన తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం కార్పొరేషన్ ఆఫీసులో ఇంటి పన్ను, కుళాయి పన్నుపేరు మార్పు కోసం మ్యుటేషన్ ఫీజుగా చలానా చెల్లించి, వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సచివాలయంలో డాక్యుమెంట్లు పొందుపరచిన అనంతరం, ఆర్ఐ, ఆర్వో లాగిన్, ఆ తర్వాత కమిషనర్ లాగిన్ వద్దకు దరఖాస్తు చేరుతుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావటానికి చాలా సమయం పడుతుందని, ప్రస్తుతం అమలు చేయనున్నఆటో మ్యుటేషన్ విధానంతో కార్పొరేషన్ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన పని ఉండదని, ఆస్తుల కొనుగోలు తర్వాత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే రిజిస్ట్రార్ ఆఫీసులోనే మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. దీని వలన సమయం ఆదా కావటంతో పాటుగా కార్పొరేషన్ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన పని ఉండదని తెలిపారు.

# వృద్ధులను ఆదరించటం ప్రతి ఒక్కరి బాధ్యత

తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007 పై అవగాహన కల్పించాలి - ఎంఎల్ఏ డా. చదలవాడ అరవింద బాబు






**పెన్ పవర్ నరసరావుపేట ప్రతినిధి జులై 30**

పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం–2007 మరియు ట్రాన్స్ జెండర్ హక్కుల చట్టం– 2019 అమలుపై ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా కలెక్టర్ పి. అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, తల్లిదండ్రులు మన జీవితంలో దేవుని స్వరూపం. వృద్ధాప్యంలో వారిని గౌరవించటం, సంరక్షించటం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం అనేక పథకాలు, ముఖ్యంగా పెన్షన్ పెంపు వంటి 'సూపర్ సిక్స్' కార్యక్రమాలను అమలు చేస్తోంది అని అన్నారు. జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు మాట్లాడుతూ, తల్లిదండ్రులు, వృద్ధులు తమ సంపాదన లేక ఆస్తి ద్వారా జీవించలేనప్పుడు, ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చు. సమస్యలను విచారించి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వారిని నిర్లక్ష్యం చేసిన వారసులపై చర్యలు తప్పవు అని తెలిపారు. లాయర్ శిరీష మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 41 ప్రకారం తల్లిదండ్రుల సంక్షేమానికి చట్టాలు రూపొందించబడ్డాయి. వారసులు తల్లిదండ్రుల నిర్వహణ, అవసరాలను తీర్చకపోతే రూ.5,000 జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష విధించవచ్చు అని వివరించారు. అలాగే, ప్రతి జిల్లాలో కనీసం ఒక వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలని చట్టం సూచిస్తోంది అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధుల ఆహారం, వైద్యం, వసతి, గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించబడింది. డివిజన్, మండల, గ్రామ స్థాయిలో కూడా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, ఏ.డి. దుర్గా భాయ్, వయోవృద్ధులు, లాయర్ శిరీష, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలు ఇంటి నిర్మాణానికి హామీ -ఎమ్మెల్యే నసీర్





**పెన్ పవర్, గుంటూరు, జులై.30**

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలన–తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం రెండో డివిజన్ ఆర్టీసీ కాలనీలో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ఏడాది కాలంలో తమ ప్రాంతాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన నాయకుడు రావడంతో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుపరిపాలన–తొలి అడుగుకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంచుతూ ఎమ్మెల్యే నసీర్ ముందుకు సాగారు. పార్టీ పథకాల అమలుపై ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అర్హులెవరికైనా పథకాలు అందకపోతే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆర్టీసీ కాలనీలో వర్షం పడితే అడుగుపెట్టాలంటే గుంతలమయంగా ఉండేవని, ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టిందని మండిపడ్డారు. కనీస మౌలిక వసతుల గురించి పట్టించుకోకుండా దోపిడీ మాత్రమే చేశారని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను 90 శాతం అమలు చేశామని వెల్లడించారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటు, తల్లికి వందనం, వాట్సాప్ గ్రీవెన్స్ వంటి కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువయ్యామని తెలిపారు. రానున్న నాలుగేళ్లలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పథాన నడిపిస్తామని చెప్పారు. ఆర్టీసీ కాలనీలో పీ శ్రీలక్ష్మి అనే వృద్ధురాలు ఇంటి పైకప్పు పూర్తిగా దెబ్బ తినడంతో ఎమ్మెల్యే నసీర్ వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటి పైకప్పు నిర్మాణానికి తన సొంత నిధులు వెచ్చిస్తానని ఆ వృద్ధురాలికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దాసరి రాజా మాస్టర్, డిప్యూటీ మేయర్ సజీలా, క్లస్టర్ ఇంచార్జ్ సయ్యద్ అన్వర్, డివిజన్ అధ్యక్షులు జబీ ఖాన్, బెల్లా వెంకటేశ్వర్లు, కోటా పిచ్చిరెడ్డి, మొవ్వ శైలజ, బాబు, భాషీ, దిలీప్, శాంతి, దాసు, డేవిడ్, మహేష్, దాసరి శ్రీను, సుభాని, బుచ్చిబాబు, సెగల రూబెన్ ,ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మద్యం కేసులో వెలుగులోకి సంచలన విషయాలు రాచకొండ లక్ష్మయ్య

**పెన్ పవర్, గుంటూరు, జులై.30**



అయ్యా వరుణ్ పురుషోత్తం జనం వైకాపాకు దాచి వుంచి ఇచ్చినట్లుగా అన్నే కోట్లు.అంత కరెక్టుగా ఎలా లిక్కర్ బాసు ఫీల్ అవ్వడాదేవుడి స్క్రిప్ట్ అని' ఇప్పటికే మోహన సింధూరం పెట్టుకొన్నాడు. 11 సార్లు వేపమండలతో కొట్టుకొంటాడేమో నెత్తిన ఈ విషయం తెలిస్తే ఏపీ మద్యం కేసులో వెలుగులోకి సంచలన విషయాలు – గత వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో కొత్త కోణాలు – ఏపీ మద్యం కేసులో ఏ–40 వరుణ్, పురుషోత్తం నోట సంచలన నిజాలు – నేరాన్ని అంగీకరించి నిజాలు బయటపెట్టిన నిందితుడు వరుణ్ పురుషోత్తం – ఏపీ మద్యం కుంభకోణానికి సంబంధించిన నగదు నిల్వల వివరాలు వెల్లడి వరుణ్, పురుషోత్తం సమాచారంతో రంగంలోకి దిగిన సిట్ అధికారులు ఏపీ మద్యం కుంభకోణం విచారణలో కొన్నిరోజులుగా వేగం పెంచిన సిట్ హైదరాబాద్ శివారు ఫామ్ హౌస్ లో రూ.11వేల కోట్ల నగదు నిల్వలు – గత వైసీపీ హయాంలో జరిగిన మద్యం స్కాంలో రూ.11వేల కోట్లకు పైగా దోపిడీ –ఈ వైసీపీ ముఖ్య నేతల పాత్రపై కీలక సమాచారం సిట్ కు లభ్యం పూర్తి ఆధారాలతో కొందరు పెద్దల పాత్ర కూడా బయటపడే అవకాశం ఉందని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు.

# వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ వర్క్‌షాప్ ఘనంగా నిర్వహణ ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు

**పెన్ పవర్ నరసరావుపేట ప్రతినిధి జులై 30**

పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వన్యప్రాణుల సంరక్షణపై (వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్) వర్క్‌షాప్‌ను జిల్లా ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్యప్రాణుల సంరక్షణ, స్థానిక జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత కాపాడటంలో ప్రజల పాత్ర వంటి అంశాలపై విస్తృతంగా చర్చించబడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు, జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు, పాల్గొన్నారు. ప్రత్యేక ఆకర్షణగా స్టేజీపై స్థానిక వన్యప్రాణుల జంతుశ్రేణుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లా సమృద్ధమైన జీవవైవిధ్యానికి నిలయం. నాగార్జునసాగర్ ఆనకట్ట, కొండలు, అడవులు అనేక జాతుల వన్యప్రాణులకు ఆవాసంగా ఉన్నాయి. వీటిని కాపాడటం పర్యావరణ సమతుల్యతకు అవసరం. వన్యప్రాణుల సంరక్షణ కేవలం అధికారుల బాధ్యత కాదు. ప్రతి పౌరుడూ ఇందులో భాగస్వామిగా ఉండాలి అని పిలుపునిచ్చారు. అలాగే యువత, విద్యార్థులలో ఈ అంశంపై అవగాహన పెంపుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు మాట్లాడుతూ – సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వన్యప్రాణుల సంరక్షణ మరింత సమర్థవంతంగా మారుతోంది. డ్రోన్లు, శాటిలైట్ ఇమేజరీ వంటి ఆధునిక పద్ధతులు అడవుల పర్యవేక్షణకు ఉపయుక్తం, అని తెలిపారు. జిల్లా ఫారెస్ట్ అధికారి మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలోని అడవులు, నదీ తీరాలు, కొండలు వన్యప్రాణుల జీవనానికి కీలకం. అక్రమ వేట, కలప నరికివేత, అటవీ ఆక్రమణ నియంత్రణకు విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో చర్చించిన ముఖ్యాంశాలు: నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులులు, చిరుతలు, జింకలు, పక్షుల సంరక్షణ అక్రమ కలప నరికివేత, వేట నివారణ కార్యక్రమంలో స్థానిక ప్రజల భాగస్వామ్యం కావాలని కోరారు.




**స్టేజీపై జంతువుల ప్రదర్శన:** ప్రదర్శనలో పక్షులు, సరీసృపాలు, ఇతర చిన్న వన్యప్రాణులు ప్రదర్శించబడి వాటి జీవన విధానం, పర్యావరణ పాత్రను వివరిస్తూ ప్రత్యేక డాక్యుమెంటరీలు చూపించబడ్డాయి. వీటి ద్వారా పాల్గొన్నవారికి వన్యప్రాణుల సంరక్షణపై లోతైన అవగాహన కలిగింది. ఈ వర్క్‌షాప్ ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రజా భాగస్వామ్యం పెంపుకు మార్గం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా ఫారెస్ట్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ టైక్వాండో పోటీల్లో సత్తా చాటిన వేటపాలెం గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు



**వేటపాలెం,పెన్ పవర్,జూలై 30**

జూలై 25 నుండి 27 వరకు విజయవాడలో టైక్వాండో నేషనల్ ఓపెన్ పోటీలు నిర్వహించబడినవి. ఈ పోటీల్లో వేటపాలెం గర్ల్స్ హైస్కూల్ లో చదువుచున్న అక్కాచెల్లెల్లు యార్లగడ్డ లక్ష్మీ ప్రియ మరియు లాస్య ప్రియ పాల్గొని కాంస్య, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రార్థన సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని, వ్యాయామ ఉపాధ్యాయులు జె. దేవబిక్షం, జె. శ్రావణి, ఉపాధ్యాయులు అభినందించారు.

## 6వ రోజుకు చేరిన శ్రీ కంచి కామాక్షమ్మ

### శ్రావణమాస పూజలు





**భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై, 30**

మండల కేంద్రమైన భట్టిప్రోలులో శ్రావణమాసం ఆరవ రోజైన బుధవారం శనగపల్లి త్రిపుర సుందరావు-కుసుమ దంపతుల గృహంలో శుక్రవారోత్సవ కమిటీ ప్రధాన నిర్వాహకురాలు బూర్లె అరుణ కుమారి ఆధ్వర్యంలో కంచి కామాక్షమ్మ అర్చన మరియు పాదారవింద శతకము పారాయణ ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ దేశ పటం అమ్మవారిగా చూస్తే నాభి స్థానం కంచి అని తెలిపారు. ఉత్తర భారత దేశంలో హిమాలయంలో కాత్యాయన మహర్షి, పరమేశ్వరుని గూర్చి తపస్సు చేశాడు. ఈశ్వరుడు ప్రత్యక్ష మై ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. ఆ మహర్షి జగన్మాత నాకు కూతురుగా కావాలని కోరాడని తెలిపారు. పసి పాపలాగా,అమ్మ కాత్యాయనుడు మహర్షి ఒడిలోకి చేరింది. కాత్యానుడిచే పెంచబడినది కనుక అమ్మను కాత్యాయని అని పిలుస్తారని అరుణ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాటూరు స్వరూప, మాటూరు గృహలక్ష్మి,మద్దుల నలిని, బూర్లె ధనలక్ష్మి, ఎండూరి సూర్యప్రభ, బూర్లె హేమ పద్మ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## పత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో 29వ వార్డులో ఖాళీ స్థలాల శుభ్రత



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 30:**

చిలకలూరిపేట: నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు 29వ వార్డులో ముమ్మరంగా ఖాళీ స్థలాల శుభ్రత కార్యక్రమం కొనసాగుతోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వార్డులోని పలు ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగిపోయి, ఇళ్లలోకి పాములు వస్తున్నాయని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిగణనలోకి తీసుకున్న ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ఆయా ఖాళీ స్థలాలను వెంటనే శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బేరింగ్ మౌలాలి స్వయంగా పర్యవేక్షిస్తూ, ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి చెట్లను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు. "వర్షాల వల్ల ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరిగిపోయి పాముల బెడద పెరిగిందని స్థానికులు మా దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు గారు వెంటనే స్పందించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఈ స్థలాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఈరోజు 29వ వార్డులో శుభ్రత కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నాం" అని బేరింగ్ మౌలాలి తెలిపారు. ఈ చర్య పట్ల 29వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుకు, బేరింగ్ మౌలాలికి తమ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ శుభ్రతా కార్యక్రమం ద్వారా పాముల బెడద తగ్గి, పరిసరాలు పరిశుభ్రంగా మారతాయన్నారు.

# తొలి అడుగు కార్యక్రమంలో అడుగడుగునా ప్రజల నుంచి నీరాజనాలు -ఎమ్మెల్యే నసీర్

**పెన్ పవర్, గుంటూరు, జులై 30**

సుపరిపాలన-మన ఎమ్మెల్యే తొలి అడుగు అంటూ ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే నసీర్ కు అన్ని ప్రాంతాల నుంచి బ్రహ్మారథం పడుతున్నారు. గత ఐదేళ్లలో రోడ్లు లేక, నీళ్లు రాక, కాలువలు పూడికలు తీయక అవస్థలు పడిన ప్రజలకు.. కేవలం ఏడాది కాలంలోనే అన్ని మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆహ్వానిస్తున్నారు. సుపరిపాలన-మన ఎమ్మెల్యే తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ తో కలిసి గుంటూరులోని ఏడో డివిజన్ లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. తొలుత స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎల్లప్పుడూ ప్రజల వెంట నడిచే నాయకుడు మరోసారి పండుగలా కదిలి రావడంతో ఆ ప్రాంత ప్రజలు పులకించిపోయారు. అక్కా.. బాగున్నారా ? నీళ్లు సమయానికి వస్తున్నాయా ? తల్లికి వందనం డబ్బులు పడ్డాయా ? అంటూ ఎమ్మెల్యే నసీర్ ఆప్యాయంగా పలకరించారు. ఆ ప్రాంతంలో తల్లికి వందనం నిధులు పడిన తల్లిదండ్రులు తమకు కూడా పథకం అందిందని, పిల్లలను సంతోషంగా పాఠశాలలకు పంపిస్తున్నామని తెలిపారు. ఏడాది నుంచి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నామని, దీంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో



కాలనీల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఏ ఒక్కరూ అనారోగ్య కారణంగా ఇబ్బందులు పడకూడదనే మహోన్నత లక్ష్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 200 మందికి రూ.3.50 కోట్ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించామని వెల్లడించారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటుతో నిరుపేదలకు కడుపు నిండా అన్నం



పెడుతున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను పూర్తిగా అధిగమించి ప్రగతికి ముందడుగు వేస్తున్నామని వెల్లడించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి తలమానికమైన నందివెలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గత ఐదేళ్లలో ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని అటకెక్కించారని మండిపడ్డారు. పీ-ఫోర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# సమాజ సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం అవ్వాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**పెన్ పవర్, గుంటూరు, జులై.30**

సమాజంలో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు సమాజ సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం అవ్వాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం వివిధ ప్రైవేట్, కళాశాల యాజమాన్యంతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి తన క్యాంపు కార్యాలయంలో పీ - 4 గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... దేశంలో ఏంతో మంది పాలకులు మారిన కూడా పేదరికాన్ని పూర్తి స్థాయిలో నిర్మూలించలేకపోయారని, పేదరికం లేని సమాజము వలన అసమానతలు తగ్గుతాయిని, చంద్రబాబు భావించి పీ - 4 అనే కార్యక్రమానికి నాంది పలికారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. దీని కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, సమాజంలో మార్పు తీసుకొచ్చే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందని, అటువంటి వ్యక్తులు ముందుకు వస్తే, మార్పు ఖాయమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక బ్రహ్మాండమైన ఆలోచనతో ముందుకు వచ్చారని, రాష్ట్రంలో పేదరికం నిర్మూలించి, ప్రతి ఒక్కరిని ఆర్థికముగా బలోపేతం చేయాలని లక్ష్యంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఇప్పటికే అనేక రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి పీ - 4 లక్ష్యాలను వివరించామని, చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారని, ఉపాధ్యాయులుగా మీరు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని, మీ పాఠశాలల, కళాశాలకు వచ్చే బంగారు కుటుంబాల విద్యార్థిని, విద్యార్థులకు ఆర్థికంగా సహాయం, విద్యాపరంగా సహాయం అందించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు మాట్లాడుతూ... ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేసి, విజ్ఞప్తి కి తాము వివిధ రూపాల్లో బంగారు కుటుంబాలకు సహాయం అందించటానికి సిద్ధంగా ఉన్నామని, పేద విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొంటూ, కుటుంబాలను దత్తత తీసుకుంటూ, మార్గదర్శులుగా తమ పేర్లను పీ- 4 వెబ్ సైట్ లో నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఓబులేసు, యాగంటి దుర్గా రావు, అంజయ్య మరియు వివిధ పాఠశాల, కళాశాల యాజమాన్యం, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంరక్షణ బాధ్యత విస్మరిస్తే చట్టపర చర్యలు - జిల్లా ఇంచార్జ్ కలెక్టర్



**మచిలీపట్నం, (పెన్ పవర్) జూలై 30**

వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, వారి సంక్షేమాన్ని విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో విభిన్న ప్రతి భావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007పై జిల్లా అధికారులకు నిర్వహించిన ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కొడుకు లేదా కూతురు ఆస్తులు రాయించుకుని తమ బాగోగులు పట్టించుకోకుండా వదిలేశారని జిల్లాలోని వృద్ధ తల్లిదండ్రులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల ద్వారా విన్నవించుకునేవారి శాతం ఎక్కువయ్యారన్నారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్క అధికారి వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చాలా మంది వృద్ధులు తమ పిల్లల నిరాదరణకు గురై, ఆర్థిక ఇబ్బందులతో, ఒంటరితనంతో ఎన్నో అవమానాలను భరిస్తున్నారన్నారు. సమాజంలో నిత్య కృత్యంగా జరుగుతున్న ఇలాంటి సంఘటనల పట్ల స్పందించాలని, వారికున్న హక్కులు, చట్టాలను తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులు వారి ఆస్తులను పిల్లలకు రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత వారి సంరక్షణ బాధ్యతలు తీసుకోకపోతే, చట్ట ప్రకారం అట్టి రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేయవచ్చని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమం, పోషణ పట్ల వారి పిల్లలకు అవగాహన కలిగించేందుకు కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి కామరాజుకు సూచించారు. కార్యక్రమంలో ముందుగా హెరిటేజ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టం పట్ల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, అదనపు ఎస్పి సత్య నారాయణ, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, బందరు, గుడివాడ ఆర్డీవోలు కే స్వాతి, జి బాల సుబ్రమణ్యం, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



## నెల్లూరు నగరపాలక సంస్థలో కార్మిక పోరాటం విజయం పట్ల హర్షం



**చీరాల, పెన్ పవర్, జులై 30**

నెల్లూరు పారిశుద్ధ్య పనులు ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇచ్చే టెండర్లు రద్దు చేయాలని నెల్లూరు నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు గత 14 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పోరాటానికి దిగివచ్చి స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారు, మరియు నగరపాలక సంస్థ కమిషనర్ వై ఓ నందన్ గారుద్వారా ప్రయోగాత్మకంగా ప్రారంభించిన టెండర్ ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అప్కాస్ ను కూడా యధావిధిగా కొనసాగిస్తాం అని ప్రకటించారు. అయితే గత 15 రోజుల నుండి మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి ప్రైవేటు కాంట్రాక్టులు ఇచ్చే టెండర్ రద్దు చేయాలని అరెస్టులు, జైళ్లు ను సైతం లెక్కచేయకుండా కార్మికులు వీరోచిత పోరాటం నిర్వహించారు. ఈ పోరాటంలో మున్సిపల్ కార్మికులు అనేక అనుభవాలు ఘటించారు అని చివరికి సోమవారం జరిగిన లాఠీచార్జి వందలాదిమంది కార్మికులు అరెస్టులు, అధికారుల బెదిరింపులు, ప్రభుత్వ ఒత్తిడిలు ని అధికమించి పోరాడారని వారి పోరాటానికి జేజేలు పలుకుతూ చీరాలలో మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల పోరాటం ఈ పోరాటంలో ఐక్యం సాధించడం ద్వారానే విజయం సాధ్యం పడిందని, ఐక్యంగా పోరాటం నిర్వహించడంలో నెల్లూరు నగరపాలక సంస్థ రాష్ట్ర కార్మికులు ఆదర్శనీయులైన అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికుల జిల్లా కన్వీనర్ చిమటా వీరాస్వామి, గుంటగాని ఇమ్మానుయేలు, యేండ్లురి సింగయ్య, గేరా క్రాంతి సాగర్, కోటేశ్వరమ్మ, బడుకుమారి, ఏసోద తదితరులు పాల్గొన్నారు.

## జంట హత్య కేసులో ప్రధాన నిందితుల అరెస్టు

**పెన్ పవర్, జులై 30, అద్దంకి**

ఈనెల 23న పట్టణంలోని శ్రీనిధి హోటల్ సమీపంలో చోటు చేసుకున్న జంట హత్యల కేసులోప్రధాన నిందితులను నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు నాలుగు రోజుల వ్యవధిలోనేఅరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఆర్థిక వివాదాల నేపథ్యంలో ఈనెల 23న పట్టణంలో బెంగళూరుకు చెందిన తండ్రి కొడుకులు వీరస్వామి రెడ్డి ప్రశాంతి రెడ్డి లను నియోజకవర్గం లోని సంతమాగులూరు గ్రామానికి చెందిన అనిల్ రెడ్డి,బాదం మాధవ రెడ్డి, గడ్డం రఘురాం రెడ్డి, తదితరులు కిడ్నాప్ చేసి హతమార్చినట్లు కేసు నమోదు చేసిన విషయం తెలిసిన విషయం. కిడ్నాప్ జరిగిన ప్రదేశం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కావడం. హత్య జరిగిన ప్రదేశం బాపట్ల జిల్లా సంతమాగులూరు పరిధి కావడంతో, దర్యాప్తు ప్రక్రియ క్లిష్టతరంగా మారింది. అయితే పోలీసు ఉన్నతాధికారులు రెండు హత్య ల కేసును నర్స రావుపేట మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు నర్సారావుపేట డిఎస్పి కే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు మహారాష్ట్ర లోని ముంబై ప్రాంతంలో సంచరిస్తున్న విషయం తెలుసుకొని సిఐలు ఎం.వి చరణ్, హైమారావు, బి సుబ్బానాయుడు, పి రామకృష్ణల నేతృత్వంలో ఎస్సైలు హరిబాబు , వంశీకృష్ణ లు ప్రత్యేక బృందాలు గా బొంబాయి వెళ్లి మూడు రోజుల వ్యవధిలోనే ప్రధాన నిందితులైన బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన బాదం మాధవరెడ్డి, గడ్డం రఘురాం రెడ్డి, గడ్డం నాగిరెడ్డి, గడ్డం గోపిరెడ్డి, గడ్డం ఇంద్రసేనారెడ్డిలను ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రత్యేక బృందాలు బొంబాయిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టణానికి తరలించారు. ఈనెల 30న మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఆవుల సలోమి ఎదుట హాజరు పరుచగా రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు మొత్తం 13 మందిని నిందితులుగా పేర్కొన్నారు. గతంలో అనిల్ రెడ్డిని అరెస్టు చేశారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు . మొత్తం ఆరుగురు నిందితులను మూడు రోజుల వ్యవధి లోనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

# లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి -రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి





**భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై, 30**

కృష్ణా నది పరివాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. బుధవారం కృష్ణా నది కరకట్టను ఆమె రెవెన్యూ సిబ్బందితో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ నుండి 60,875 క్యూసెక్కుల నీరు క్యూసెక్కుల నీటిని బ్యారేజ్ అధికారులు దిగువ ప్రాంతానికి విడుదల చేశారని ఆమె తెలిపారు. రెండు అడుగుల మేర 15 గేట్లు,అడుగు మేర 55 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారని ఆమె తెలిపారు. దీని కారణంగా వరద పోటెత్తే ప్రమాదం ఉందని,తీర ప్రాంత ప్రజలు,లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేయాలని, గ్రామాల్లోకి నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని, అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆమె తెలిపారు. కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతంలో ఇసుక మూటలు వేసేందుకు అందుబాటులో ఉంచుకోవాలని కృష్ణానది అధికారులను ఆమె ఆదేశించారు. పశువులను నదిలోనికి వదలకుండా, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడాలని ఆమె తెలిపారు. వ్యవసాయ విద్యుత్ పంపు చెట్లను జాగ్రత్త చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్ వెంకటరమణ,ఆర్ ఐ తన్నీరు లీలా అరుణ ఫణి కుమార్, భట్టిప్రోలు పిఎసిఎస్ అధ్యక్షులు పరుచూరి రమేష్ బాబు, భట్టిప్రోలు ఎస్ ఐ.ఎం శివయ్య,వీఆర్వోలు పి శివరామకృష్ణ,చొప్పర రవికుమార్,మండ్రు జక్రయ్య,ఓలేరు సురేష్,పుల్లయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానదికి పెరుగుతున్న వరద

**-రెవిన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండండి.**

**-తహసిల్దార్ శ్రీనివాసరావు**





**భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై, 30:**

వర్ష రుతువు ప్రారంభమై 40 రోజులు గడవకముందే కృష్ణా నది పరివాహక ప్రాంతమైన భట్టిప్రోలు మండల పరిధిలో గల లంక గ్రామాల్లో వరద నీటిమట్టం రోజురోజుకు పెరుగుతున్నదని మండల తహసిల్దార్ ఎం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయంలో పలువురు అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 87 వేల క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజీ నుండి కృష్ణానది దిగువకు వరద నీటిని అధికారులు విడుదల చేశారన్నారు. రానున్న రెండు,మూడు రోజులలో వరద నీటిమట్టం 3 లక్షల క్యూసెక్కులకు పెరుగుతుందని తెలియవచ్చిందన్నారు. వర్షాకాలంలో మునుముందు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామాలలో ప్రజలకు గ్రామ సభల ద్వారా వరదల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియపరచవలసిందిగా ఆయన అధికారులకు తెలిపారు. ఇప్పటినుండి ఏ రెవిన్యూ అధికారి సాధారణ సెలవులు తీసుకోరాదని,ఉద్యోగ విధివిధానాలపై అలసత్వం వహించరాదని తహసిల్దార్ అన్నారు. గత సంవత్సరం 11 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతిని చూశమని, బలహీనంగా ఉన్న కరకట్ట వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆయన తెలిపారు. తక్షణ సహాయక చర్యల్లో భాగంగా లైటింగ్ స్టిక్స్, పునరావాస కేంద్రాలను గుర్తించి తగు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్,ఆర్ ఐ మరియు విఆర్వోలు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజారోగ్య కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంప్ -కమిషనర్ పులి శ్రీనివాసులు





**పెన్ పవర్, గుంటూరు, జులై.30.**

ప్రజారోగ్యం కాపాడే ప్రజారోగ్య కార్మికులకు ఐటిసి ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఐటిసి ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ కు కమిషనర్ ఆదేశాల మేరకు జిఎంసి తరుపున హాజరైన డిప్యూటీ కమిషనర్, ఇంచార్జి సిఎంఓహెచ్ టి.వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ నిత్యం వ్యర్థాలు తొలగింపు వంటి విధుల్లో ఉండే కార్మికులకు ఆరోగ్య సమస్యలు కూడా అధికంగానే వస్తుంటాయని, వారికి ఐటిసి ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్మికులు కూడా క్యాంప్ ల్లో తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకొని, వైద్యులు సూచించిన విధంగా ఏమైనా మెడిసిన్లు తీసుకోవాలని సూచించారు.

పోస్టల్ డిపార్ట్మెంట్ మేనేజర్ సైదులు చౌదరి మాట్లాడుతూ కార్మికులకు తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఉపయోగాలు లభించే కేంద్ర భీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కార్మికులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐటిసి ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ మేనేజర్ కే.నారాయణ, డాక్టర్ షేక్ అమిదా, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# 150 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు





**వేటపాలెం,పెన్ పవర్, జూలై 30**

వేటపాలెం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో ఈ సంవత్సరం 150 మందికి పైగా విద్యార్థులు 10వ తరగతి చదువుచున్నారు. వీరందరికీ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, అవ్వారు సుజాత, వి. జయంతి ఉచితంగా స్టడీ మెటీరియల్ ను ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని ద్వారా అందించారు. చదువుల్లో వెనకబడిన వారికి మరియు మెరిట్ స్టూడెంట్స్ వేరువేరుగా స్టడీ మెటీరియల్ ను అందించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన "బ్లూప్రింట్" ఆధారంగా తయారు చేయబడిన సోషల్ స్టడీస్ స్టడీ మెటీరియల్ ను ఇప్పటినుంచే ప్రణాళిక బద్ధంగా చదువుకొని మంచి మార్కులు సాధించాలన్నారు. సులభంగా, సరళంగా అందరికీ అర్థమయ్యేటట్లు తక్కువ సమయంలో మంచి మెటీరియల్ తయారుచేసిన పల్నాడు జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మిరియాల శివశంకర్ అండ్ టీం కి ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదములు తెలిపారు.

# ప్రకాశం బ్యారేజీ లో వరద నీటి ప్రవాహం రాను రాను పెరుగుతున్న దృష్ట్యా అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

**మచిలీపట్నం (పెన్ పవర్) జులై 30**

బుధవారం సాయంత్రం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి క్షేత్రాధికారులతో వరదలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీకి 3 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉందని, 2 అడుగుల మేరకు అన్ని గేట్లను ఎత్తివేసి వరద నీటిని క్రిందకు వదిలారని, ఆ నీరు పూర్తి ఒరవడితో దిగువన ఉన్న కృష్ణాజిల్లాలోకి వస్తోందన్నారు. క్షేత్రాధికారులందరూ వారి ప్రధాన కేంద్రాల్లో అందుబాటులో ఉండి వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సిబ్బందికి ఎవరికైనా సెలవులు ఇచ్చి ఉంటే వాటిని వెంటనే రద్దుచేసి విధులకు హాజరుకావాలని ఆదేశించారు. జలవనరుల శాఖ అధికారులు కాలువల వద్ద గట్టి నిఘా ఉంచి వరదనీటి స్థాయిని ఎప్పటికప్పుడు గమనించుకోవాలన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో అన్ని గ్రామాల్లో దండోరా వేయించి లోతట్టు ప్రాంతాల ప్రజలను



అప్రమత్తం చేయాలన్నారు.. ఇందుకోసం గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి వెంటనే వరద సమాచార సందేశాన్ని పంపించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో వెంటనే ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటుచేసి తగిన చర్యలు తీసుకునే విధంగా పనిచేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలాల్లోని గ్రామాలను సందర్శించి వరద పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. వరద ఉధృతి ఆకస్మాత్తుగా పెరిగే అవకాశం ఉన్నందున ఈతకు వెళ్లే వారిని వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు డిఎస్పి లతో సమన్వయం చేసుకొని వరద పరిస్థితులను గమనించి ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, ఆర్డీవోలు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, జలవనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కంచికచర్లలో పోలీసులు వాహనాల తనిఖీలు








**మచిలీపట్నం (పెన్ పవర్) జులై 30:**

కంచికచర్ల పట్టణంలో స్థానిక నెహ్రూ సెంటర్ నందు కంచికచర్ల ఎస్సై ఎస్సై బి. రాజు ఆధ్వర్యంలో పోలీసులు జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీలు చేశారు. హెల్మెట్ లేకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులను, వాహనాలకు సరైన పేపర్లో లేని వాటిని, పరిమితికి మించి ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. హెల్మెట్లు, సరైన పేపర్లు, పరిమితికి మించి వెళ్తున్న వాహనదారులను పట్టుకొని వారి వాహనాలను సీజ్ చేసి స్టేషన్కు తరలించారు. సదరు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు వేగంగా వెళ్లకూడదని, అన్ని నిబంధనల ప్రకారం పేపర్ లు ఉంటే ప్రయాణించాలని కోరారు. భారీ ఎత్తున చలానాలను రాశారు. పోలీసుల తనిఖీలతో వాహనదారులు బెంబేలెత్తారు.

# పోలీస్ స్టేషన్లలో వీల్ చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలి



**వేటపాలెం,పెన్ పవర్,జులై 30**

చీరాల సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లలో వీల్ చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని కోరుతూ నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్.కాలేషా బుధవారం చీరాల డిఎస్పి మోయిన్ కు వినతిపత్రం అందజేశారు. వికలాంగుల సౌకర్యార్థం పోలీస్ స్టేషన్లలో ఈ ఏర్పాట్లు చేయాలని గుంటూరు రేంజ్ ఐజి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారని ఆయన డిఎస్పీకి చెప్పారు. తక్షణం ఐజి ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమేష్, బాపట్ల జిల్లా అధ్యక్షులు ఇరుపని. వెంకటేశ్వర్లు, పరణం. అనిల్ నాయుడు, గుడిపాటి. రవితేజ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

# ఆగస్టు 6న అద్దంకిలో మెడికల్ ఆసెస్మెంట్ క్యాంప్

**బల్లికురవ పెన్ పవర్, జూలై 30**

బల్లికురవ మండలంలోని ప్రాధమిక,ప్రాథమికోన్నత, ఉన్నత, ఎయిడెడ్,ప్రయివేటు పాఠశాలలోని 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వివిధ రకాల వైకల్యాలు గల విద్యార్థులకు ఆగస్టు 6న అద్దంకి పట్టణంలోని ఎంపియుపిఎస్ సివి వీధి (సత్రంబడి) నందు అద్దంకి నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 6వ తేదీ బుధవారం మెడికల్ ఆసెస్మెంట్ క్యాంపు జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి -1 కే. శ్రీనివాసరావు,విద్యాశాఖాధికారి-2) కే. రమేష్ లు ఒక ప్రకటన లో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినికిడి లోపం,దృష్టి లోపం, శారీరక అంగవైకల్యం,మానసిక వైకల్యం,ఆటిజం,పుట్టుకతో వచ్చు పక్షవాతం,మొదలగు వారికి ప్రత్యేక వైద్యనిపుణులచే వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాలు అందిస్తారని వారు తెలియజేశారు. ఈ అవకాశాన్ని బల్లికురవ మండలాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపుకు హాజరయ్యే వారు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికేట్ జిరాక్స్,రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరములకు బల్లికురవ భవిత కేంద్రములోని ఉపాధ్యాయులు పూనూరి నాగబాబు 8019612052, గోవాడ నాజిని సంప్రదించాలని తెలియజేశారు.

# ప్రతి పంటకు ఈ క్రాఫ్ చేయించుకోవాలి








**పొన్నలూరు పెన్ పవర్ జులై 30**

మండలంలోని కె అగ్రహారం కోటపాడు గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వ్యవసాయ సహాయకులు సింగరాయకొండ ,డాక్టర్ ఈ.నిర్మల కుమారి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి పంటకూ పంట నమోదు కార్యక్రమం సంబంధిత వ్యవసాయ సహాయకులు ద్వారా చేసుకోవాలని సూచించారు . ఖరీఫ్ ,రబీ సీజన్లో వేసే ప్రతి కౌలు రైతు మీ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు మీరు వేసే పంటను తెలియజేసి గ్రామ రెవెన్యూ అధికారులు ద్వారా కౌలు ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునని, తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు,ఎరువులు, ధాన్యం అమ్ముకోవడానికి, ప్రకృతి వ్యాపారిత్యాల వల్ల వచ్చే పంట నష్టం లేదా పంట పండకపోతే ఇన్సూరెన్స్, బ్యాంకుల నుండి పంట రుణాలు అన్నదాత సుఖీభవ వంటి పథకాలను పొందవచ్చునని తెలియజేసారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వం కలిపి 7000.00 లబ్దిదారుల రైతులకు జూలై 2వ తేదీన వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందని, అరత ఉండి ఈ కే వై సి లేదా బ్యాంక్ నందు ఎన్ పి సి ఐ కాని రైతులు రేపటి లోపల ( 31 జూన్) సరి చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి వి రాము మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కి సంబంధించి ఇన్సూరెన్స్ చేసుకోవాలని (ఎకరాకు) వరికి రూ.860.00 కంది రూ .430.00 , సజ్జ రూ.156.00 మినుము రూ .205.00 నువ్వులు రూ .180.00 మరియు ఎర్ర మిరపకు రూ.4500.00 దీనికి సంబంధించి ప్రకాశం జిల్లాలో ఇ సి ఐ సి లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అనే ఇన్సూరెన్స్ కంపెనీకి రైతులు మీ ప్రీమియం జూలై 31లోపల, వరికి మాత్రం ఆగస్టు 15తేదీ లోపల ప్రీమియం చెల్లించాలని తెలియజేసారు.పొన్నలూరు పశు వైద్యాధికారి డాక్టర్ పి.శివరామ క్రిష్ణ మాట్లాడుతూ పశు పోషకులకు పశువులలో వచ్చు వ్యాధులు గురించి మరియు వివిధ పథకాలు గురించి వివరించారు.ఉద్యానవన శాఖ అధికారిని పి.విష్ణుప్రియ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ నుండి కూరగాయలు, పండ్లు మరియు పూల తోటల పెంపకానికి 40శాతం రాయితీ వస్తుందని, అలాగే పండ్ల తోటలు గల రైతులకు సేద్యపు కుంటలు మల్చింగ్ రాయితీ తో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా డ్రిప్ మరియు స్ప్రింక్లర్ ఉన్నాయని, 10ఎకరాల లోపు రైతులకు 90 శాతం డ్రిప్ మరియు 5ఎకరాల లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీ తో డ్రిప్ అందుబాటులో ఉన్నాయని కావున కావలసిన రైతులు అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. లీటరు నీటికి కలిపి పిచిక కాపాడ.పై కార్యక్రమంలో కె అగ్రహారం గ్రామ వ్యవసాయ సహాయకులు వి. కిషోర్ కోటపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు కె.మధు ,గ్రామ పశు వైద్య సహాయకులు పి కొండలరావు రెండు గ్రామాల పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చుట్టపు చూపుగా వచ్చి పలకరించి వెళుతున్న చిరుజల్లులు

**ప్రజలకు బేజారు కల్పిస్తున్న చిరుజల్లులు.**

**చిరుజల్లులతో తమకు ఎలాంటి ఉపయోగం లేదంటున్న రైతులు.**



**కొమరోలు పెన్ పవర్ జూలై 30.**

భారీ వర్షాలకు రావలసిన కాలంలో చుట్టపు చూపుగా అప్పుడప్పుడు వస్తూ పలకరించి వెళుతున్న చిరుజల్లులు తమను బేజారుకు గురి చేస్తున్నాయని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. జూన్, జూలై ఆగస్టు, సెప్టెంబరు మాసాలు వర్షాకాలం. ఈ కాలంలో భారీ వర్షాలు కురిసి వాగులు వంకలు చెరువులు నిండి పొంగిపొర్ల వలసిన కాలం. అయితే గత నెల నుంచి కూడా అప్పుడప్పుడు చిరుజల్లు కురుస్తున్నాయి తప్ప భారీ వర్షాలు సూచన కనుచూపుమేరలో కనిపించడం లేదు. అప్పుడప్పుడు కురుస్తున్న చిరుజల్లుల వల్ల తమ ఎలాంటి ప్రయోజనం లేదని ,అంతేకాక పొలాల్లో సాగుచేసిన కూరగాయల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. దీనితో కూరగాయల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. అప్పుడప్పుడు కురుస్తున్న చిరుజల్లులు తమ పనులకు ఆటంకం కలిగిస్తూ బేజారు చేస్తున్నాయని చిరు వ్యాపారులు సాధారణ ప్రజలు చెబుతున్నారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు సమయంలో చిరుజల్లులు కురిసాయి. దీనితో చుట్టూ చూపుగా వచ్చి పలకరించి వెళుతున్న చిరుజల్లుల వల్ల నష్టాలు ఇబ్బందులే తప్ప ప్రయోజనాలు లేవని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

# జర్మనీ దేశం నందు ఉద్యోగ అవకాశాల కల్పన..

**ఎస్సీ ఎస్టీ నర్సింగ్ మహిళల కోసం ఉచిత శిక్షణ...**

**రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాటు.....**

**ప్రకటనలో వెల్లడించిన నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి..**

**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ జూలై 30**

ఎస్సీ ఎస్టీ మహిళా నర్సింగ్ అభ్యర్థుల కోసం జర్మనీ దేశం నందు ఉద్యోగావకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత శిక్షణ మరియు ప్లేస్మెంట్ కార్యక్రమమునకు శ్రీకారం చుట్టింది అని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమం మరియు సామాజిక సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు యస్సి, ఎస్టీ వర్గానికి చెందిన మహిళా నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు (జిఎన్ఎమ్, బీఎస్సి నర్సింగ్) ఉచిత శిక్షణ కల్పించి జర్మనీ దేశం నందు ఉద్యోగావకాశాల కల్పన కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం లోని శిక్షణ కేంద్రాలలో నిర్వహించబడుతుందని చెప్పారు. అభ్యర్థులు 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి మూడు సంవత్సరాలు అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు అని అన్నారు. శిక్షణ పూర్తి అయినవారికి జర్మనీ దేశం నందు €2,700 నుంచి €3,500 జీతం ఉంటుందని వెల్లడించారు. భారత కరెన్సీలో సుమారు రూ. 2,40,000/- నుండి రూ. 3,10,000/- వరకు ప్రతి నెల జీతం ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలం 8 నుండి 10 నెలలు ఉంటుందని చెప్పారు. ఈ శిక్షణా తరగతులు నందు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. శిక్షణకు సంబంధించిన డాక్యుమెంట్ల అనువాదం మరియు అటెస్టేషన్ ఖర్చులు, బి2 జర్మన్ భాష పరీక్ష మొదటి ప్రయత్న ఫీజు ఉద్యోగదారులదే అని తెలిపారు. అంతే కాకుండా వీసా మరియు విమాన టికెట్ల ఖర్చులు కూడా ఉద్యోగదారులే భరిస్తారు అని తెలిపారు. ఇందుకు అవసరమైన డాక్యుమెంట్లు జనన ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, 12వ తరగతి మార్క్షీట్, నర్సింగ్ డిప్లొమా/బిఎస్సి సర్టిఫికేట్, నర్సింగ్ లైసెన్స్, వర్క్ ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్లు, పోలీస్ క్లియరెన్స్, గుడ్ స్టాండింగ్ సర్టిఫికేట్, చెల్లుబాటు అయ్యే పాస్పోర్ట్ కచ్చితంగా ఉండాలని తెలిపారు. కింద ఇచ్చిన లింకు ద్వారా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఆగస్టు 7వ తారీఖు లోపు అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# డ్రాప్ ఔట్ విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించిన ఎంఈఓ గోవర్ధన్



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 30**

చదువును మధ్యలో ఆపివేయడం, పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్న విద్యార్థులపై స్థానిక మండల విద్యా అధికారి ఎం.గోవర్ధన్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. దీనిలో భాగంగా మండలంలోని పోట్లూరు ఎస్.టీ కాలనీలో స్థానిక అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎంఈఓ ఇంటింటికి తిరిగారు. చదువు మానేసి పాఠశాలకు వెళ్లకుండా ఉన్న విద్యార్థులను గుర్తించి, అందరినీ ఒక చోటకు చేర్చి, డ్రాప్ ఔట్ విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, పాఠశాలకు పంపాలని సూచించారు. చదువు యొక్క ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓతో పాటు ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి రైతు తప్పనిసరిగా కౌలు కార్డు అప్లై చేసుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి పి మధుబాబు**

**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 30**






కౌలుకు భూమి తీసుకొని సాగు చేసేటటువంటి ప్రతి రైతు తప్పనిసరిగా గ్రామ రెవిన్యూ అధికారి దగ్గర కౌలు కార్డుకు అప్లై చేసుకొని కౌలు కార్డు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.మధుబాబు తెలిపారు. చంద్రశేఖరపురం మండలంలోని ముండ్లపాడు మరియు డి.టి.పల్లి గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం లో భాగంగా పంట సాగుదారు హక్కు పత్రం ( కౌలు కార్డులు) పై రైతులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంభందించి అర్హులైన రైతుల జాబితా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందని, పచ్చిరొట్ట విత్తనాలు అయిన జీలుగ, జనము, పిల్లి పెసర కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం లోని అధికారులును సంప్రదించాలని తెలిపారు .కౌలుకు పొలం తీసుకొని సాగు చేసేటటువంటి రైతులు కౌలు కార్డు తీసుకోవడం వలన రుణము, ప్రభుత్వం అందించే పంటల బీమా, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ శాఖ నుండి వచ్చేటటువంటి రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టముకు గల రాయితీలు పొందుటకు ప్రయోజనాలు కలుగుతాయని తప్పనిసరిగా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం ఉండవలెనని తెలిపారు పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వడం వలన భూమి యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు కౌలు రైతులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, దేవాదాయ భూములకు కూడా పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వవచ్చునని, మండలంలోని కౌలుకు సాగు చేసేటటువంటి రైతులందరూ మీ గ్రామ రెవిన్యూ అధికారి లేదా రైతు సేవా కేంద్రం లోని గ్రామ వ్యవసాయమరియు ఉద్యాన సహాయకులు సంప్రదించి పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వి. శ్రీకాంత్ మరియు ఆయా గ్రామాలలోని రైతులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

**నిబంధనల ప్రకారం అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలి- ఆర్టీవో చందన**



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 30**

ప్రైవేటు పాఠశాలలు, కళాశాల బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని ఆర్టీవో చందన తెలిపారు.స్థానిక ఆర్టీవో కార్యాలయంలో ఆర్టిఓ చందన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 31లోగా త్రైమాసిక పన్ను చెల్లించని వాహనాలపై సీజ్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినియోగంలో లేని వాహనాలను వెబ్సైట్లో నమోదు చేస్తే పెనాల్టీ తప్పిస్తారని చెప్పారు. రోడ్ సేఫ్టీపై ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్లోడింగ్పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. స్కూల్ బస్సులకు ఫిట్నెస్, లైసెన్స్ తప్పనిసరి అని, ఫిట్నెస్ లేని 95 బస్సులపై చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. 15 ఏళ్ల వయస్సు పైబడిన వాహనాలను విద్యార్థుల రవాణాకు వాడరాదని హెచ్చరించారు.

# ఖరీఫ్ సీజన్ పంటలను ఈ -పంట నమోదు చేయాలి





**గిద్దలూరు పెన్ పవర్ జులై 30**

గిద్దలూరు మండలంలో ముండ్లపాడు బురుజుపల్లి గ్రామల్లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 కి సంబందించి ఈ-పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని. రైతులు తప్పనిసరిగా ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి ఒక్క పంటను నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకోవడం వలన అతివృష్టి, అనావృష్టి వచ్చినప్పుడు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా అందించే నష్టపరిహారం, పంటల భీమా, మద్దతు ధర ,సున్నా వడ్డీ తదితర ప్రభుత్వ సహాయలు అందాలంటే తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకొని ఉండాలన్నారు. ఖరీఫ్ 2025-26 సీజన్ లో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద రైతులు స్వతహాగా రైతులే పంట భీమా కి రైతు వాటా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ సీజన్ లో ప్రకాశం జిల్లా లో వరి, కంది, సజ్జ, నువ్వులు, మినుములు,పత్తి , ఎండు మిరప మొదలైన పంటలు పంటల భీమా పథకం కింద వర్తిస్తాయని తెలిపారు.పంట భీమా కంది, సజ్జ, మినుములు, నువ్వులు,ఎండు మిరప జులై 31 వరకు వరి పంట ఆగస్ట్ 15 వరకు గడువు ఉందన్నారు . పంటలు భీమా చేయదల్చిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ మొదలైనవి తీసుకొని దగ్గర లోని మీ-సేవ, సి ఎస్ సి సెంటర్, బ్యాంక్ లు మొదలైన చోట పంట భీమా కి నమోదు చేసుకోవచ్చున్నారు . పై పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా పంట భీమా కి నమోదు చేసుకోవాలని సూచించారు. వరి పంటకి ఎకరాకి రూ.860/-,కంది పంట కి ఎకరాకి రూ. 430/-, సజ్జ పంటకి ఎకరాకి రూ. 156/- మినుములు కి రూ.205/-, నువ్వులు కి రూ. 180/-,ఎండు మిరప కి ఎకరాకి రూ.4500/- ఎకరాకి కట్టి పంట భీమా కి నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ సభ అనంతరం మొక్కజొన్న, ఆముదం మొదలైన పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు , వాటి నివారణ చర్యలు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్దయ్య, కిరణ్ , రైతులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపిన ఆటో డ్రైవర్ కు జైలు శిక్ష




**గిద్దలూరు పెన్ పవర్ జులై 30**

గిద్దలూరు లో మద్యం తాగి ఆటో నడిపిన ఆటో డ్రైవర్ కు బుధవారం గిద్దలూరు కోర్టు 7 రోజుల పాటు జైలు శిక్ష విధించింది. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలలో మద్యం తాగినట్లుగా గుర్తించి కేసు నమోదు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి భరత్ చంద్ర రూ.10 వేలు జరిమానాలతో పాటు వారం రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.